సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం, 8, మార్చి, 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 335 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం

37.4°/9.9°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: చక్కటి ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాయామంతో దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పుట్టపర్తి మండలం పెడపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. 'జన ఔషధి దివస్' కార్యక్రమంలో భాగంగా రోగులను స్వయంగా పరీక్షించి బీపీ, షుగర్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారిన ఆహారపు అలవాట్లతో ప్రతి కుటుంబంలోనూ ఒకరిద్దరు బీపీ, షుగర్‌తో బాధపడుతున్నారన్నారు. 30 ఏళ్ల వయస్సు దాటిన వారంతా తరచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోజూ వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉంచవచ్చన్నారు. వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, ఎంఎల్‌హెచ్‌పీ రాధ, సిబ్బంది సుస్మిత, పద్మావతి, వాణీబాయి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ



పోలీస్ అధికారులతో ఆనందం పంచుకుంటున్న బాధితులు

పుట్టపర్తి అర్బన్: చోరీకి గురైన 42 సెల్‌ఫోన్లను ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ బాధితులకు మంగళవారం తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ సుమారు 162 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు చెప్పారు. సెల్‌ఫోన్ చోరీకి గురైతే 6305800426 సెల్ నంబర్‌కు మొబైల్ వివరాలు వాట్సాప్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామక్రిష్ణప్రసాద్, పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్, సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, దిశ సీఐ లక్ష్మణ, టెక్నికల్ ఆస్ఐస్సై వెంకటేశ్వరరావు, క్యాట్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసమ్మకు ఉత్తమ కండక్టర్ అవార్డు

కదిరి టౌన్: కదిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీనరసమ్మ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. వైఎస్సార్ జిల్లా కడపలో బుధవారం నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారుల చేతులమీదుగా ఆమె అవార్డు, సత్కారం అందుకోనున్నారు. 2022 సంవత్సరంలో మూడు రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు గానూ ఆమెను ఎంపిక చేసినట్లు కదిరి డిపో మేనేజర్ మైనొద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత, రామకృష్ణ తెలిపారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



బ్యాలెట్ బాక్సుల గదిని పరిశీలిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి అర్బన్/కొత్తచెరువు: ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగు చర్యలు చేపట్టామని, 13 జరిగే పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన పుట్టపర్తిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాల, కొత్తచెరువులోని బాలికల ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలతో పాటు బ్యాలెట్ బాక్సులు భద్ర పరిచిన గదులను పరిశీలించారు. టీచర్లు, గ్రాడ్యుయేట్ల కోసం పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలు, స్ట్రాంగ్ రూం వద్ద చేపట్టవలసిన బందోబస్తు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీసు అధికారులకు పలు సూచనలిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,550 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు.









అనంతపురం ఇటుకల ఫ్యాక్టరీలో మహిళా కార్మికులు, జనశక్తినగర్ పెట్రోల్ బంకులో వాహనాలకు పెట్రోల్ నింపుతున్న మహిళ, చెరకు జ్యూస్ తయారీలో నిమగ్నమైన మహిళ, అనంతపురం సమీపంలోని చెరువులో వల విసురుతున్న మత్స్యకార మహిళ

అవని...ఆకాశం..ఆమె!

- సంకల్పానికి తోడు..'సాగు'లో చేదోడు
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- ఆదర్శవంతమైన జీవితాలతో ఎందరికో స్ఫూర్తి

మహిళా దినోత్సవం

ఇంటా...బయటా...అన్నింటా ఆమె. ఇల్లు, పొలం, కార్యాలయం ఎక్కడైనా ఆమే. కుటుంబాలకు తోడు...సమాజ వికాసానికి చేదోడు. ఆకాశంలో సగం.. అంతులేని సహనం.. అమితమైన నేర్పరితనం.. ఆలిలా..అమ్మలా..అత్తమ్మలా..తోబుట్టువులా..ఇలా..లాలిస్తూ, పాలిస్తూ, అడుగడుగునా తోడైంది. అన్నింటా 'రాణి'స్తూ.. స్వ'శక్తి'గా ఎదుగుతోంది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న జిల్లా మహిళామణుల జీవనయానంపై ప్రత్యేక కథనం..



మానస

తోడు దూరమైనా.. పట్టువదలని నాగజ్యోతి



నాగజ్యోతి, డిప్యూటీ కలెక్టర్

పుట్టపర్తి: చిన్న వయస్సులోనే భర్త దూరమైనా.. ఆమె పట్టు వదల్లేదు. తల్లిదండ్రులు, కుమారుడి ప్రోత్సాహంతో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించింది. ఆమె బుక్కపట్నానికి చెందిన పిచ్చల నాగజ్యోతి. భర్త వెంకటరెడ్డి 2013వ సంవత్సరంలో మృతి చెందగా... అప్పటికే ఉపాధ్యాయ ఉద్యోగం చేస్తున్న నాగజ్యోతి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గ్రూప్స్‌కు సిద్ధమైంది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టువదలని దీక్షతో చదివింది. 2022 జూలైలో గ్రూప్–1 విజేతగా నిలిచి డిప్యూటీ కలెక్టర్‌ఉద్యోగం సాధించింది.

సాగులో రాణిస్తున్న గంగమ్మ



పొలంలో మొక్కలకు నీరు కడుతున్న గంగమ్మ

అమరాపురం: మండలంలోని మద్దనకుంట గ్రామానికి చెందిన గంగమ్మ భర్త 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటికి ఆమె కుమారుడు బాలచంద్రకు రెండేళ్లు. ఐదెకరాల పొలం ఉన్నా సాగు చేసే వారు లేరు. దీంతో గంగమ్మ పొలంలో దిగింది. కష్టమైనా చెమటోడ్చింది. మెట్ట భూముల్లో మామిడి, చింత సాగు చేసింది. అంతర పంటగా వేరుశనగ సాగుచేస్తూ స్వశక్తితో ఎదిగింది. ఎవరిపై ఆధారపడకుండా బతుకుతోంది.

సోడాల బండితో చేదోడు



సోడాలు విక్రయిస్తున్న బీబీబేగం

హిందూపురం ధరం పురానికి చెందిన బీబీబేగం కష్టానికి నిలువెత్తు నిదర్శనం. భర్త సంపాదనతో కుటుంబం గడవదని తెలుసుకున్న బీబీబేగం తనవంతు సాయంగా నిలిచింది. తోపుడు బండిపై సోడా, కూల్‌డ్రింక్స్ దుకాణం ఏర్పాటు చేసుకుంది. రోజూ ఏడీబీ బ్యాంకు పక్కనే ఎర్రటి ఎండలో నిలబడి వ్యాపారం చేస్తోంది. వేసవిలో ప్రజలకు చల్లని సోడా, నన్నారి, నిమ్మసోడాలు అందిస్తూ నాలుగు రాళ్లు సంపాదిస్తోంది. ప్రస్తుతం ఆమె ఒక్కగానొక్క కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతుండగా...భవిష్యత్‌లో బిడ్డను ఉన్నతవిద్యావంతుడిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెబుతోంది.

బతుకు బండి నడుపుతూ ..



ఆటో నడుపుతున్న భారతి

హిందూపురం: బస్సు క్లీనర్‌గా పనిచేసే భర్త ఎటో వెళ్లిపోయాడు. ఇద్దరు కుమారులు సంతానం. వారిని ఎలా పోషించాలో, ఏం చేయాలో తెలియని ఆమె ఆటో డ్రైవర్‌గా మారింది. కుమారులను ప్రయోజకులను చేయడంతో పాటు ఎందరికో ఆదర్శంగా నిలిచింది. ఆమే హిందూపురం హస్నాబాద్‌కు చెందిన 45 ఏళ్ల భారతి అలియాస్ రత్న. మూడు చక్రాల వాహనాన్నే తన బతుకుబండిగా చేసుకుంది. హిందూపురం – తూమకుంట చెక్‌పోస్టు మధ్య ఆటో నడిపిస్తూ కుటుంబానికి ఆదరువుగా మారింది. భర్త తిరిగి వచ్చినా అన్నం పెట్టిన ఆటోను వదల్లేదు. ప్రస్తుతం భారతి పెద్ద కుమారుడు విజయవాడలోని ఓ కంపెనీలో పనిచేస్తుండగా, రెండో కుమారుడు ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. తన ఒంట్లో శక్తి ఉన్నంతవరకు కష్టపడతానని చెబుతున్న భారతిని చూసి సమాజమే మెచ్చుకుంటోంది.

నాట్య మయూరి మానస

ధర్మవరం: ఆమె పాదం కదిపితే నటరాజు నాట్యమాడినట్లు ఉంటుంది. ఆమె నాట్య విన్యాసాలకు అవార్డులెన్నో వచ్చిచేరాయి. నాట్యంలో రాణిస్తూనే సమాజ సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది ధర్మవరానికి చెందిన నృత్య కళాకారిణి మానస.

రాష్ట్ర స్థాయి నంది పురస్కారం

ధర్మవరం పట్టణంలోని పీఆర్‌టీ వీధికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త తులసీ, చిరుద్యోగి కృష్ణ దంపతుల కుమార్తె మానస. ప్రస్తుతం ఎంబీఏ చదువుతోంది. చిన్ననాటి నుంచే నాట్యంలో శిక్షణ పొందిన మానస రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి ఆహూతులను ఆకట్టుకుంది. 2021లో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి నృత్య ప్రదర్శనలో తన అద్భుత నాట్య విన్యాసాలతో నంది అవార్డును సొంతం చేసుకుంది. తమిళనాడులో జరిగిన వడయార్ నృత్య ప్రదర్శనలోనూ పాల్గొంది. దాదాపు 102 మంది కళాకారులు చేసిన ఈ నృత్య ప్రదర్శన గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించింది. తనలోని ప్రతిభను అందరికి పంచాలన్న ఉద్దేశంతో మానస పేద విద్యార్థులకు ఉచితంగా నాట్యం నేర్పుతోంది. మరోవైపు ఆపదలో ఉన్న పేదలకు సాయం అందించేందుకు డ్యాన్స్ అండ్ కల్చరల్ సంఘం అనే ఓ ట్రస్ట్‌ను నెలకొల్పిన మానస...తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది.

ఎందరికో ఆదర్శం సరస్వతి



పంటకు నీరు పెడుతున్న మహిళా రైతు సరస్వతి

అగళి మండలం మధూడి గ్రామానికి చెందిన సరస్వతికి మొదటి నుంచీ వ్యవసాయం అంటే మక్కువ. అందువల్లే రోజూ భర్తతో పాటు పొలం వెళ్లి సాగులో సాయంగా నిలిచేది. ఎనిదేళ్ల క్రితం భర్త మృత్యువాత పడగా...ఇద్దరు పిల్లల పోషణ, కుటుంబ పోషణ భారం సరస్వతి మీద పడింది. దీంతో సరస్వతి... సాగుకు సిద్ధమైంది. ఎవరి సాయం లేకుండానే పొలం పనులన్నీ చేసుకునేది. వ్యవసాయ అధికారుల సూచన మేరకు ప్రకృతి వ్యవసాయం చేసింది. అధిక దిగుబడులు సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచింది. ప్రస్తుతం సరస్వతి కుమార్తె అరుణ్య బీటెక్, కుమారుడు నిఖిల్ ఇంటర్ చదువుతున్నారు.

గరుడ వాహనంపై దేవదేవుడు



గరుడవాహనంపై నారసింహుడు



ఖాద్రీశుని దర్శనం కోసం భారీగా తరలి వచ్చిన భక్తులు

కదిరి: అశేష భక్త జన గోవింద నామస్మరణలతో కదిరి మార్మోగింది. ఖాద్రీ లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మ గరుడ సేవలో తూర్పు రాజగోపురం వద్ద స్వామి వారిని దర్శించుకుంటే మరింత పుణ్యం వస్తుందని భక్తుల విశ్వాసం. అందువల్లే స్వామి వారు గరుడవాహనంపై ప్రధాన రాజ గోపురం వద్దకు రాక మునుపే ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. నారసింహుడు తూర్పు రాజ గోపురం వద్దకు చేరుకోగానే 'శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా..గోవింద' అని భక్తుల నోట మార్మోగి పోయింది. విద్యుద్దీ పాలంకరణ, కదిరి మల్లెలతో శ్రీవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కేరళ వాయిద్యాలు ఆహూతులను అలరించాయి.

వెబ్ క్యాస్టింగ్‌తో పోలింగ్ పర్యవేక్షణ

- డీఆర్ఓ కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ కొండయ్య

పుట్టపర్తి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టినట్లు డీఆర్ఓ కొండయ్య తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, పోలింగ్ సరళిని వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఉన్నతాధికారులు పరిశీలిస్తుంటారన్నారు. మంగళవారం స్థానిక సాయిఆరామంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ కొండయ్య మాట్లాడుతూ... ఈనెల 13న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు పోలింగ్ ఉంటుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. పుట్టపర్తిలోని చిన్నపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ సామగ్రి అందజేస్తారని, విధులకు హాజరయ్యే వారంతా నిర్దేశించిన సమయానికి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలన్నారు. 100 మీటర్ల మార్కు ఏర్పాటు చేయడంతో పాటు పోలింగ్ రోజు ఉదయం 7 గంటలకు పోలింగ్ ఏజెంట్లకు పాస్‌లు, సిట్టింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వర్తించే వారు ప్రతి ఓటరునూ గమనించాలన్నారు.

తెలుపు, పింక్ కలర్ బ్యాలెట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీకి తెలుపు రంగు బ్యాలెట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పింక్ కలర్‌లో బ్యాలెట్ ఉంటుందని డీఆర్ఓ కొండయ్య వివరించారు. ఎన్నికల కమిషనర్ సూచించిన ఏదైనా గుర్తింపుకార్డు, పోలింగ్ స్లిప్ ఉన్న వారికి బ్యాలెట్ అందజేయాలన్నారు. అలాగే ఏ విధంగా ఓటు వేయాలో కూడా వివరించాలన్నారు. పోలింగ్ అధికారులు ప్రతి గంటకూ పోలింగ్ శాతాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు శివరంగప్రసాద్, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



అశేష భక్తజనం నడుమ రథంపై ఊరేగుతున్న శ్రీదేవి భూదేవి సమేత నారసింహస్వామి

- వైభవంగా కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం
- భారీగా పాల్గొని తరించిన భక్త జనం

చిలమత్తూరు: 'నమో నారసింహా..గోవిందా...గోవింద' అంటూ భక్తుల జయజయధ్వానాల నడుమ చిలమత్తూరులో వెలసిన కనుమ లక్ష్మీనరసింహుడు రథంపై కొలువుదీరి ముందుకు కదిలారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఆలయం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఉంచి అశేష భక్త జనం తోడురాగా రథం వరకూ ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. అనంతరం శ్రీవారిని రథంలో కొలువుదీర్చారు. ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చౌళూరు మధుమతి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు స్వామివారిని కీర్తిస్తూ రథాన్ని ముందుకు లాగారు. అడుగడుగునా రథంపైకి అరటిపండ్లు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యోగి వేమన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, పార్టీ నాయకులు, జిల్లాతో పాటుగా కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఎమ్మెల్సీ ప్రచార వేడి

- ఉమ్మడి జిల్లాలో ఊరూరా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం
- మంత్రి, విప్‌లతో పాటు ఎమ్మెల్యే లందరూ ప్రచారంలోనే..
- గ్రామాల్లో ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్న ద్వితీయశ్రేణి నాయకత్వం
- తెలుగుదేశం పార్టీలో నామమాత్రంగానైనా కనిపించని ప్రచారం
- టీచర్, పట్టభద్రులు రెండింటినీ కైవసం చేసుకునేలా వైఎస్సార్‌సీపీ వ్యూహం


హిందూపురం సువర్ణభారతి కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి నాలుగు రోజులే సమయం ఉండటంతో అభ్యర్థులు ప్రచారం ఉధృతం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం ఊపందుకుంది. మరోవైపు టెలీకాలర్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు హోరెత్తాయి. పోలింగ్ తేదీ దగ్గర పడే కొద్దీ వ్యూహ ప్రతివ్యూహాలతో నాయకులు ముందుకెళుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార వేడి పెరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం ఉధృతం చేశారు. కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీచరణ్ ఇప్పటికీ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని గ్రామగ్రామానా తిరుగుతున్నారు. మరోవైపు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఓటరు ఒక్కరున్నా సరే ఆ గ్రామానికి వెళ్లి కలుస్తున్నారు.

ఎమ్మెల్యేలందరూ ప్రచారంలోనే..

ఉమ్మడి జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేల్లో 12 మంది వైఎస్సార్‌సీపీ వారే. వీరిలో ఒకరు విప్, మరొకరు మంత్రి పదవిలో ఉండగా.. మిగతా పది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు అభ్యర్థుల ప్రచారంలోనే నిమగ్నమై ఉన్నారు. ఉరవకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నా ప్రచారంలో మాత్రం వైఎస్సార్‌సీపీ నాయకులే ముందంజలో ఉన్నారు. ఎమ్మెల్యేలతో పాటు ద్వితీయశ్రేణి నాయకులందరూ గ్రామా ల్లో ఓటర్లను కలిసి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వివరిస్తున్నారు. కొన్ని చోట్ల సాధారణ ఎన్నికలను తలపించేలా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచార తీరు చూస్తోంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం నల్లేరుపై నడకే అని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.

కనిపించని టీడీపీ ప్రచారం

తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిరుత్సాహంలో ఉన్నాయి. నాయకులు ఎక్కడా సమన్వయంతో పని చేయడం లేదని అభ్యర్థులు అసంతృప్తితో ఉన్నారు. ఏ నియోజకవర్గంలోనూ పదిమంది కలిసి ప్రచారం నిర్వహించిన సందర్భం కనిపించడం లేదు. కొన్నిచోట్ల టీడీపీ అభ్యర్థి కంటే పీడీఎఫ్ అభ్యర్థే ముందంజలో ఉన్నట్టు టీడీపీ నాయకులే చెబుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని కొంతమంది టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో..	
పట్టభద్రుల ఓటర్లు	43,310
పురుషులు	29,686
మహిళలు	13,620
ట్రాన్స్‌జెండర్	4
టీచర్ ఓటర్లు	3,349
పురుషులు	2,277
మహిళలు	1,071
ట్రాన్స్‌జెండర్	1

క్లుప్తంగా

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. పోలింగ్ నిర్వహణ అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుంచి జేసీ కేతన్‌గార్గ్, సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి నిర్వహణ, పంపిణీ, అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ఇలా ప్రతి అంశంపైనా అధికారులకు స్పష్టమైన విధివిధానాలను ఎన్నికల కమిషన్ రూపొందించిందన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. నిబంధనల ఉల్లంఘన ఏ స్థాయిలోనూ జరగకుండా అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేవారికి వీలైనంత ముందుగానే పోస్టల్ బ్యాలెట్ పేపర్ అందించాలన్నారు. 800 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రంలో జంబో బ్యాలెట్ పెట్టె వినియోగించాలని సూచించారు. పోలింగ్ రోజున కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ విధుల్లోని అధికారులు, సిబ్బందికి వసతి, భోజన సదుపాయం, కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా పోలింగ్ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ అధికారి కేశవనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- పీఓలు, ఏపీఓలకు శిక్షణ పూర్తి
- మార్చి 10న మరోసారి సమీక్ష
- జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ నుంచి జిల్లా రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీసత్యసాయి జిల్లా అధికారులతో మాట్లాడారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, కదిరి ఆర్డీఓ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నామన్నారు. మార్చి 10న అధికారులతో మరోసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. అధికారులకు వారి సొంత మండలంలోగాని, విధులు నిర్వహించే మండలంలో గాని విధులు కేటాయించలేదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులతో పాటు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పుట్టపర్తిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్ నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్లకు వైట్, ఉపాధ్యాయులకు పింక్ కలర్ క్లాత్ బ్యాగ్‌లు కేటాయించినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఐఅండ్‌పీఆర్ ఏడి వేలాయుధం, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, నోడల్ అధికారి బాలాజీ, సూపరెండెంట్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


భార్య కాపురానికి రాలేదని గొంతు కోసుకున్నాడు!


తీవ్రంగా గాయపడిన సురేష్

చిలమత్తూరు: భార్య కాపురానికి రాలేదనే ఆవేదనతో మద్యం మత్తులో ఓ వ్యక్తి గొంతు కోసుకున్నాడు. మండల పరిధిలోని దేమకేతేపల్లి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. గోరంట్ల మండలం నార్సింపల్లికి చెందిన సురేష్ మండలంలోని శెట్టిపల్లిలో వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మళ్లీ తిరిగి రాలేదు. ఈ క్రమంలోనే మంగళవారం మండలంలోని దేమకేతేపల్లికి చేరుకున్న సురేష్ మద్యం తాగి, ఆ మత్తులో గొంతు కోసుకున్నాడు. స్థానికులు గుర్తించి తీవ్రంగా గాయపడిన సురేష్‌ను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భృగుతీర్థ స్నానం.. పాప విమోచనం


భృగుతీర్థం


భవనాసినీ తీర్థం

కదిరిలో వెలసిన లక్ష్మీ నారసింహుడు నిత్య పూజలతో బ్రహ్మాండ నాయకుడిగా వెలుగొందుతున్నారు. ప్రస్తుతం స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. విభిన్న వాహనాల్లో స్వామివారు విహరిస్తూ భక్తులను ఆశీర్వదిస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఖాద్రీశుని భృగుతీర్థంపై ప్రత్యేక కథనం. – కదిరి:

పవిత్ర ఖాద్రీ దివ్యక్షేత్రానికి పడమటి వైపున అర్జున నదీ (మద్దిలేరు) తీరం ఉంది. అక్కడ భృగు మహర్షి తపస్సు చేసి.. స్వామి వారిని స్మరించుకున్నారని, మహర్షి కోరిక మేరకు శ్రీవారు స్వయంగా శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలను అందించినట్లు బ్రహ్మాండ పురాణం చెబుతోంది. ఆ ఉత్సవ విగ్రహాలే ఇప్పుడు బ్రహ్మోత్సవాల్లో తిరువీధుల్లో ఊరేగుతుండడం గమనార్హం.

- వసంత రుతువులో శ్రీవారు అనుగ్రహించడంతో ఉత్సవ మూర్తులకు వసంత వల్లభులని పేరొచ్చింది. భృగు మహర్షి తపస్సు ఫలితంగా ఖాద్రీ క్షేత్రంలో శ్రీవారు స్వయంభువుగా వెలిశారు. భృగు తీర్థంలో స్నానం చేసి, స్వామి వారిని దర్శించుకుంటే పాప విమోచనం కలుగుతుందని స్థల పురాణం. అందుకే స్వామివారికి తలనీలాలు సమర్పించి భక్తులు భృగుతీర్థంలో స్నానమాచరిస్తారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మద్దిలేరు వాగు కోనేరు మీదుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో శాశ్వత ప్రాతిపదికన కోనేరు పునర్నిర్మాణానికి ఆలయ అధికారులు, కమిటీ శ్రీకారం చుట్టింది.

గతంలో భవనాసినీ తీర్థంలో స్నానం

గతంలో భక్తులు ఆలయ ప్రాంగణంలోని ఈశాన్యంలో ఉన్న భవనాసిని తీర్థంలో స్నానమాచరించేవారు. ఇందులో స్నానం చేసిన అనంతరం స్వామి వారిని దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అయితే బావిలాగా ఉన్న ఈ భవనాసినీ తీర్థంలోకి మహిళా భక్తులు దిగడం కష్టమనే భావనతో ఆలయాధికారులు ప్రస్తుతం భక్తులను ఇందులో స్నానం చేయడానికి అనుమతించడం లేదు. ఆలయప్రాంగణంలోనే కొళాయిలు, స్నానపు గదులు ఏర్పాటు చేశారు.

మొత్తం 13 తీర్థాలు..

శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా భృగుతీర్థం, భవనాసిని తీర్థాలతో పాటు మొత్తం 13 పవిత్ర తీర్థాలు ఉన్నట్లు బ్రహ్మాండ పురాణం ద్వారా తెలుస్తోంది. మొదటి గజేంద్ర తీర్థం, 2. ఆళ్వారుల తీర్థం, 3. అచ్యుత తీర్థం, 4. భృగుతీర్థం, 5. అర్జున తీర్థం, 6. శ్వేత పుష్కరిణి తీర్థం, 7. భవనాసిని తీర్థం, 8. గరుడ తీర్థం, 9. నాగుల తీర్థం, 10. కూర్మతీర్థం, 11. స్వర్ణతీర్థం, 12. శ్రీ తీర్థం, 13. క్షీర తీర్థం ప్రస్తుతం దీన్ని పాలబావిగా పిలుస్తున్నారు.

పూడికతీతతో భూగర్భ జలాల పెరుగుదల

- డ్వామా పీడీ రామాంజనేయులు

రొళ్ల: చెరువులు, కుంటలు, కట్టలతో పాటు చెక్ డ్యాంలలో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా భూగర్భజలాలు పెరిగి రైతులకు మేలు కలిగే అవకాశం ఉందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ సంచాలకుడు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బీజీ హళ్లి చెరువులో ఉపాధి పథకం కింద 'అమృత్ సరోవర్' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూడికతీత పనులతో వర్షపు నీళ్లు భూమిలోకి ఇంకి బోరుబావుల ద్వారా సమృద్ధిగా వస్తాయన్నారు. పనులు వేగవంతం చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించి, వలసలు నివారించాలని ఆదేశించారు. పండ్ల మొక్కల పెంపకంపై రైతులను ప్రోత్సహించాలన్నారు. రోడ్లకిరువైపుల, ప్రభుత్వ స్థలాలు, ఖాళీ ప్రదేశాల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని సూచించారు. ప్రతి పంచాయతీలో 70 శాతం పైగా కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ జయసింహ, ఎంపీడీఓ రామారావు, సీడీ–సీఎల్ఆర్సీ లక్ష్మీనారాయణ, ఏపీఓ నాగరాజు తదితరులున్నారు.

త్వరలో 6 లక్షల మందికి ఉద్యోగాలు

- ఎమ్మెల్యే శంకర నారాయణ


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు విజయవంతమైందని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. రాష్ట్రంలోని 6 లక్షల మంది నిరుద్యోగులకు త్వరలో ఉద్యోగాలు లభించనున్నాయని పేర్కొన్నారు. మంగళవారం సోమందేపల్లిలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 13 లక్షల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు కానుండడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన మెచ్చి దిగ్గజ పారిశ్రామికవేత్తలు సైతం పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చారన్నారు. రెండురోజుల వ్యవధిలోనే 350 ఒప్పందాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. పెనుకొండ పరిసర ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, దీంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల పేరిట విదేశాలకు వెళ్లి కోట్లాది రూపాయలు వృథా చేశారని విమర్శించారు. ఆర్భాటాలు తప్ప చంద్రబాబుతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, వైస్ సర్పంచ్ వేణు, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్లారెడ్డి, నరసింహ మూర్తి, ఇమామ్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న రైల్వే ఎన్నికల ప్రచారం

గుంతకల్లు: రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 10న జరిగే పోలింగ్ ప్రక్రియకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్యానల్ అభ్యర్థులు మంగళవారం గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని పలువురు కార్మికులను కలసి ఓటు అభ్యర్థించారు. యూనియన్ తరఫున బ్రాంచ్ సెక్రటరీ జె.మేఘశ్యామ్, సంఘ్ తరఫున సెక్రటరీ మల్లికార్జున ఆయా కార్మిక సంఘాల నేతలతో కలసి డీఆర్‌ఎం కార్యాలయం, డీజల్ షెడ్డు, రైల్వే ఆస్పత్రి, ఎలక్ట్రికల్‌ల తదితర విభాగాలను సందర్శించి తమ ప్యానల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కాటమయ్యా.. కరుణించవయా


కాటమయ్యస్వామి ఊరేగింపు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం కాటి కోటేశ్వరక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కాటమయ్య స్వామి ప్రభను అందంగా అలంకరించి భారీ ఊరేగింపు నిర్వహించారు. పెళ్లికొడుకుగా ముస్తాబైన కాటమయ్య స్వామిని గ్రామస్తులు కనులారా దర్శించుకుని పరవశించిపోయారు. ఈ సందర్భంగా స్వామి నామస్మరణతో క్షేత్రం మారుమోగింది. గురవయ్యల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఓబిరెడ్డి, పాటిల్ ఓబిరెడ్డి, ఆనందరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, గంగాధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, నాగిరెడ్డి, చిట్టిబాల మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కరణం సూర్యప్రకాష్ రావు, ఆలయధర్మకర్తలు రాజగోపాల్‌రెడ్డి మాజీ సర్పంచు ఎంసీ.నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

తాడిమర్రి: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పిన్నదరి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు విధానాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇళ్ల పట్టాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ప్రతి బుధవారం సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకుని పంచాయతీలో తాగునీరు, మురుగునీటి కాలువలు, పారిశుధ్యం, వీధిలైట్లు తదితర వాటిపై చర్చించుకొని తక్షణమే సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అర్జీలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ శివారెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో కుచ్చుటోపీ

- అధిక వడ్డీ ఆశ చూపి రూ.1.60 కోట్లకు టోకరా
- పదిరోజుల క్రితం పారిపోయిన దంపతులు
- అప్పుల వాళ్లకు తాజాగా ఐపీ నోటీసులు


దంపతుల ఇంటి వద్ద గుమికూడిన జనం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన దంపతులు తమ వద్ద చీటీలు వేసిన వారిని నిండా ముంచారు. చీటీ ఎత్తిన వారికి అధిక వడ్డీ ఆశ జూపి సొమ్ము తమ వద్దే ఉంచుకునే వారు. నెలనెలా ఇస్తామన్న వడ్డీలు ఇవ్వకుండా సర్దిచెప్పేవారు. ఎవరైనా గట్టిగా నిలదీస్తే 'ఆత్మహత్య' పేరుతో బ్లాక్‌మెయిల్ చేసేవారు. తాజాగా రూ.1.60 కోట్లకు ఐపీ పెట్టి నోటీసులు రుణదాతలకు పంపారు. బాధితుల వివరాల మేరకు.. దుర్గానగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ ఆరోగ్య మిత్ర, ఆయన భార్య శ్రీదేవి ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. కొన్నేళ్ల నుంచి ఇద్దరూ కలిసి చీటీలు నడిపేవారు. దాదాపు రూ.లక్షల్లో చీటీలు వేస్తూ స్థానికులను నమ్మించారు. దీంతో దుర్గానగర్, రాజేంద్రనగర్ తదితర వార్డుల మహిళలు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు చీటీలు వేసుకున్నారు. కొన్నాళ్లు బాగానే డబ్బు చెల్లించిన రాజేంద్రప్రసాద్ దంపతులు ఆ తర్వాత చీటీలు ఎత్తిన వారికి డబ్బివ్వకుండా కాలయాపన చేసేవారు. గట్టిగా నిలదీస్తే అధిక వడ్డీ ఇస్తామని ఆశ పెట్టేవారు. దీంతో చాలా మంది ప్రాంసరీ నోట్లు రాయించుకుని నెల నెలా వడ్డీలు తీసుకునేవారు. కానీ ఇటీవల వడ్డీ డబ్బు కూడా చెల్లించడం మానేశారు. దీంతో అనుమానం వచ్చిన కొందరు రాజేంద్రప్రసాద్ ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో అతని భార్య శ్రీదేవి పురుగులమందు తాగినట్లు నటించింది. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వారి పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటానని బాధితులను బెదిరించింది. దీంతో వారికి డబ్బులిచ్చిన వారంతా ఆందోళన చెందారు.

తిరుమల వెళ్తున్నామని చెప్పి...

రుణదాతల ఒత్తిడి పెరగడంతో రాజేంద్రప్రసాద్, శ్రీదేవి దంపతులు పదిరోజుల క్రితం పిల్లలతో సహా పారిపోవడానికి ప్రయత్నం చేశారు. స్థానికులు గమనించి వారిని నిలదీశారు. దీంతో దంపతులిద్దరూ అప్పటికప్పుడు కట్టుకథ అల్లారు. తాము తిరుమల వెళ్తున్నామని, వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని వచ్చిన వెంటనే అప్పులన్నీ చెల్లిస్తామని చెప్పి నమ్మించి అక్కడి నుంచి తప్పించుకున్నారు.

తాజాగా ఐపీ నోటీసులు

తిరుమల వెళ్లిన రాజేంద్రప్రసాద్ దంపతుల కోసం రుణదాతలు వాకబు చేస్తుండగా... ఒక్కొక్కరికీ ఐపీ నోటీసులు అందాయి. దీంతో కంగుతిన్న రుణ దాతలు మంగళవారం రాజేంద్రప్రసాద్ ఇంటి వద్దకు వెళ్లి అతని తల్లిదండ్రులతో గొడవ పడ్డారు. తాము కూలీనాలి చేసి నెలానెలా పోగేసుకున్న సొమ్ము ఇవ్వకుండా ఇలా ఐపీ నోటీసులు పంపడం భావ్యం కాదన్నారు. తమకు జరిగిన అన్యాయంపై పోలీసులను ఆశ్రయిస్తామని తెలిపారు.